

చలిగాలుల పట్ల జాగ్రత్తలు అవసరం

పరిగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చలిగాలుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని చిట్యాల ప్రాథమిక ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్.ప్రవీణ్ ఒక ప్రకనటలో సూచించారు. వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, మార్పులతో వచ్చే గాలులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. చలి కారణంగా వైరల్ సంబంధిత జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు విధిగా ఉన్ని దుస్తులను ధరించాలన్నారు. వాకింగ్, వ్యాయామం చేయడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గత ప్రభుత్వ నిర్ణయాలకు ఉద్యోగులు బలి

రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి

తూంకుంటలో వీఆర్‌వోల ఆత్మీయ సమ్మేళనం

7



జిల్లా కేంద్రంలో గురుకులాలు అధ్వానం

అస్వస్థతకు గురవుతున్న విద్యార్థులు

పట్టించుకోని అధికారులు

బీఆర్ఎస్‌వీ జిల్లా ఇన్‌చార్జి జంగయ్య

7



అన్నదాతల్లో తుఫాన్ టెన్షన్!

కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ధాన్యం కుప్పలు

టార్పాలిన్ షీట్లు కప్పిన రైతులు

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు

8





అమ్మపాటే స్ఫూర్తి

ఆమె పాటలు వింటూ పెరిగా

గతంలో లెక్చరర్.. ప్రమాదంతో రచయితనయ్యా

సమాజ శ్రేయస్సు, సంస్కృతిని తెలిపేలా రచనలు

యూట్యూబ్ చానల్ నిర్వహణ, నటనతో ముందుకు

నేడు పాటల రచయితగా ప్రత్యేక గుర్తింపు

మట్టిలో మాణిక్యం బేగరి రాములుపై స్పెషల్ స్టోరీ


ప్రతీ బిడ్డకు తొలి గురువు అమ్మ.. ఆట పాటలతో లాలిస్తూ.. కొత్త మాటలు నేర్పుతూ.. బుడిబుడి అడుగులు వేయిస్తూ.. భవిష్యత్‌కు దారి చూపుతుంది అమ్మ. అలా ఓ అమ్మ తనకిష్టమైన పాటలను వినిపిస్తూ తన కొడుకుని పెంచింది. పొలం పనుల్లో, వంటింట్లో, వీధిలో ఏ శుభకార్యమైనా అమ్మపాట వినిపించేది. ప్రతీ సందర్భాన్ని పాట రూపంలోకి మార్చి అందరినీ అలరించేది. ఈ మాతృమూర్తి నైపుణ్యమే తన బిడ్డకు అబ్బింది. తల్లి పాటలు వింటూ పెరిగిన ఆ బుడతడు పెద్దయ్యాక రచయితగా మారాడు. సమాజ శ్రేయస్సు కోసం, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా పాటలు రాస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వికారాబాద్ మండలం జైదుపల్లి గ్రామానికి చెందిన బేగరి రాములు ప్రస్థానంపై కథనం.


-వికారాబాద్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి)

7

మళ్లీ ఆదర్శ రైతు

నియామకానికి సర్కార్ యోచన





ఆదర్శ రైతు వ్యవస్థ మళ్లీ తెరపైకి వచ్చింది. వారిని మళ్లీ నియమించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. వైఎస్ఆర్ హయాంలో అమలులో ఉన్న ఆదర్శ రైతు వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసింది. గతంలో ఆదర్శ రైతులు వ్యవసాయ శాఖకు, రైతులకు అనుసంధానంగా ఉండేవారు. సాగుపై మంచి పట్టు ఉన్న వీరు పొలాల వద్దకు వెళ్లి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. ఈ వ్యవస్థ మళ్లీ అమలులోకి వస్తే రైతులకు మేలు జరగడమే కాకుండా, ఏఈవోలకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంటుంది.

ప్రతీ వెయ్యి ఎకరాలకు ఒక ఆదర్శ రైతు

ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది వరకు ఎంపిక

మరికొన్ని క్లస్టర్లను పెంచే యోచన

ఆదర్శ రైతుల రాకతో ఏవోలకు ఉపశమనం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శ రైతుల వ్యవస్థను మళ్లీ తీసుకురావాలని భావిస్తోంది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అప్పట్లో ఆదర్శ రైతుల వ్యవస్థను అమల్లోకి తెచ్చిన విషయం విదితమే. రైతులకు, వ్యవసాయశాఖకు అనుసంధానంగా పనిచేసే ఈ వ్యవస్థను దాదాపు పదేళ్ల పాటు నడిచిన తరువాత 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసింది. అయితే తాజాగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదర్శ రైతుల వ్యవస్థను త్వరలోనే అమల్లోకి తీసుకువస్తామని ఇటీవల ప్రకటించడంతో దీనిపై కదలిక వచ్చింది. గత గురువారం దీనిపై ఉన్నతస్థాయి సమావేశం కూడా నిర్వహించారు. రైతు సంక్షేమ కమిషన్‌తో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ నుంచి ఆదర్శ రైతుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు స్వీకరించారు. రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, కమిషన్ సభ్యులు కొన్ని కీలక సూచనలు చేస్తూ మంత్రికి ప్రతిపాదనలు అందజేశారు. ప్రతీ రెవెన్యూ గ్రామాన్ని ప్రాతిపదికగా తీసుకుంటూ వేయి ఎకరాలకు ఒక ఆదర్శ రైతును నియమించాలని కమిషన్ ప్రతిపాదించింది. ప్రభుత్వం దాదాపు దీన్నే ఖరారు

మిగతా 6వ పేజీలో...

సాగు, క్లస్టర్ల వివరాలు

జిల్లా	సాగు సగటు విస్తీర్ణం (ఎకరాల్లో)	క్లస్టర్ల సంఖ్య
రంగారెడ్డి	4.49లక్షలు	87
వికారాబాద్	5.81లక్షలు	99
మేడ్చల్	75వేలు	9

జిల్లాలో నేడు

'పట్నం' కస్టడీ, బెయిల్ పిటిషన్లపై విచారణ



వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్ల ఘటనలో ప్రధాన నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బెయిల్, కస్టడీ పిటిషన్లు నేడు విచారణకు రానున్నాయి. పట్నం నరేందర్‌రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలంటూ పోలీసులు కొడంగల్ జేఎఫ్ఎంసీలో పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు తీర్పు రిజర్వు చేసిన విషయం తెలిసిందే. సోమవారం మరోసారి ఈ పిటిషన్ కొడంగల్ కోర్టు ముందుకు విచారణకు రానుంది. ఈ పిటిషన్ గత సోమవారం ఆ కోర్టు ఎదుట విచారణకు రాగా, కోర్టు తన తీర్పును డిసెంబరు 2వ తేదీకి వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, ఆయన బెయిల్ పిటిషన్ కూడా వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ముందుకు నేడు విచారణకు రానుంది. ఇప్పటికే బీఆర్ఎస్ లీగల్ సెల్ బృందం న్యాయవాదులు కోర్టులో తమ వాదనలు వినిపించిన విషయం తెలిసిందే. తప్పుడు అభియోగాలు మోపి జైలుకు పంపించారని ఆరోపిస్తూ ఆయన కుటుంబం హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ విచారణలో ఉన్న విషయం తెలిసిందే. అలాగే లగచర్ల ఘటనలో రిమాండ్‌లో ఉన్న రైతులకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్ సైతం సోమవారం కోర్టు ముందుకు రానుంది.





శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు, స్వామిని దర్శించుకునేందుకు క్యూలో భక్తజనం

కీసరగుట్ట కిటకిట

- ఘనంగా రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం
- ముగిసిన కార్తీక మాసోత్సవ పూజలు

కీసర, డిసెంబరు1,(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసోత్సవం చివరి రోజు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యల్లో ఆలయానికి వచ్చారు. కార్తీక మాసోత్సవంలో భాగంగా చివరి రోజు అమావాస్యను పురస్కరించుకొని తెల్లవారుజామున స్వామివారికి మహాన్యాస పూర్వరుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తైలాభిషేకంతో పాటు వరి బియ్యంతో స్వామివారికి ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. అభిషేకం చేసిన అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. ఈ మేరకు కార్తీక మాసోత్సవంలో భాగంగా నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అదే విధంగా కార్తీక మాసం చివరి రోజు భక్తులు ఆలయంలో కార్తీక దీపాలు, శివలింగాలకు అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.



పాంబండపై దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పాంబండలో భక్తుల సందడి

కులకచర్ల: మండలంలోని పాంబండ దేవాలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసం చివరి రోజు కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకొన్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి దీపాలు వెలిగించారు. పరిగికి కొత్తగా వచ్చిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై అన్వేష్ రెడ్డి ఆలయంలో పూజలు నిర్వహించారు.



ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే

బీఆర్ఎస్ కుట్ర

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి

ధారూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే బీఆర్ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరారెడ్డి మండిపడ్డారు. గురుకుల విద్యార్థుల జీవితాలతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ ఉనికి కోసం గురుకులాల పేరుతో కుట్రలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు చరిత్ర హీనులవుతారని ఆయన దుయ్యబట్టారు. దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నాశనం చేసిందని, పదోతరగతి ప్రశ్నాపత్రాలను లీక్ చేయించి విద్యార్థుల భవిష్యత్‌ను ఆగం చేసింది బీఆర్ఎస్ వాళ్లు కాదా? అని ఆయన ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఏడాది కాలంలోనే విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి పది లక్షల మందికి అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతియాలని ప్రయత్నిస్తే బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెపుతామని ఆయన హెచ్చరించారు.

సర్కారు దూకుడు!

లగచర్ల ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు

- 643.34 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్
- ఆయా భూముల్లో అమ్మకాలు, కొనుగోళ్లు నిషేధం
- టీజీఐఐసీకి మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత



లగచర్ల గ్రామ ముఖ చిత్రం

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దుద్యాల మండలంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఫార్మా కారిడార్‌ను ఉపసంహరించుకున్న శనివారమే మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. ఇంతకు ముందు ఫార్మా కారిడార్‌ను ప్రతిపాదించిన లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలోనే ఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పార్క్ ఏర్పాటు కోసం శనివారం పోలేపల్లి, లగచర్ల గ్రామాల్లో 182.31 ఎకరాల భూసేకరణకు కొత్త నోటిఫికేషన్ జారీ చేయగా, లగచర్లలో 110.32 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ఆదివారం లగచర్ల, హకీంపేట రెవెన్యూ గ్రామాల పరిధిలో 643.34 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. లగచర్లలో 448 మంది రైతుల నుంచి 497 ఎకరాలు, హకీంపేటలో 187 మంది రైతుల నుంచి 146.34 ఎకరాల భూసేకరణ చేయాలని నిర్ణయించారు.

అమ్మకాలు, కొనుగోళ్లు నిషేధం

మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు సేకరించనున్న భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, రైతులు పేర్లు, విస్తీర్ణం వివరాలతో నోటిఫికేషన్ జారీ చేశారు. భూసేకరణకు సంబంధించిన ప్లాన్ కోసం రైతులు కలెక్టర్

మిగతా 8వ పేజీలో...

పాతోడు పోయి.. కొత్తోడు వచ్చిండు

ఎవరొచ్చినా ప్రజలకు ఒరిగిందేమీ లేదు

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ కొండా ధ్వజం



జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాతోడు పోయి.. కొత్తోడు వచ్చిండు.. ఎవరొచ్చినా ప్రజలకు ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతు పండుగలు రైతులు చేసుకోవాలని, రాజకీయ పార్టీలు కాదని హితవు పలికారు. కొత్త ప్రభుత్వంపై ప్రజలు ఆశ పెట్టుకుంటే ఆరు గ్యారెంటీలలో ఒక్కటీ అమలు చేయడం లేదని ఆయన మండిపడ్డారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రజా పాలనకు వ్యతిరేకంగా బీజేపీ చేపడుతున్న నిరసన కార్యక్రమంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన బీజేపీ యాత్రను ఎన్టీఆర్ చౌరస్తాలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలలో ఒక్కటి కూడా అమలు చేయడం లేదని, ఒకటి రెండు ఇచ్చినట్లు చేసి అన్నీ అమలు చేశామని గొప్పలు చెబుతున్నారన్నారు. ఈ రోజు తెలంగాణ రైతాంగం బతికి ఉందంటే అది బీజేపీ పార్టీ చలువే అని అన్నారు. ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ కింద రూ.12 వేల కోట్లు బీజేపీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ సైతం పన్నులు ద్వారా వచ్చిన డబ్బుల మీద నడుస్తుందన్నారు. ఒక్క నయా పైసా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకులు సదానందారెడ్డి, దిశ కమిటీ సభ్యుడు వడ్లనందు, నాయకులు నరోత్తంరెడ్డి, పాండు, విజయభాస్కర్ రెడ్డి, వివేకానందారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చరణ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శరణ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న

కీసర, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న సూచించారు. ఆమె ఆదివారం కీసరగుట్టలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఇటీవల గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిశుభ్రతను పాటించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్పాహారం సేవించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్న

పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

శంకర్‌పల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డితో కలిసి శంకర్‌పల్లి మున్సిపల్‌లోని 7, 12వ వార్డుల్లో శానిటేషన్‌పై ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణ, చిన్న శంకర్‌పల్లి వెళ్లే దారిలో మురుగు కాలువలను శుభ్రం చేయించారు. చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ కాగితాలు, సీసం ముక్కలు తదితర వాటిని సిబ్బందితో తీయించారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రేపు(మంగళవారం) ఉదయం 6గంటలకు శంకర్‌పల్లి చౌరస్తా నుంచి బీడీఎల్ చౌరస్తా వరకు 2కే రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ అశోక్, నాయకులు ప్రకాష్, ప్రవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో రన్నరప్‌గా రంగారెడ్డి జిల్లా జట్టు



రంగారెడ్డి బాలలికల జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలబాలికల రగ్బీ టోర్నీలో రెండు విభాగాల్లో రంగారెడ్డి జిల్లా జట్టు రన్నరప్‌గా నిలవగా మహబూబ్‌నగర్ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో నల్గొండపై మహబూబ్‌నగర్ జట్టు 2-1 తేడాతో, బాలికల విభాగంలో రంగారెడ్డిపై మహబూబ్‌నగర్ జట్టు 2-0 స్కోర్ తేడాతో గెలుపొందాయి. బాలుర విభాగంలో నల్గొండ, బాలికల విభాగంలో రంగారెడ్డి జట్లు రన్నర్ నిలిచాయి. మూడో స్థానంలో బాలబాలికల విభాగంలో మెదక్ జట్లు నిలిచాయి. విజేతలకు ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీ పరిశీలకులు కిష్టయ్య, ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి, టోర్నీ కార్యదర్శి నిరంజన్‌రావు, రగ్బీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ ఆదర్శ రైతు

(5వ పేజీ తరువాయి)

చేయాలని భావిస్తోంది. రైతులకు మెరుగైన సేవలందించేందుకు ఆదర్శ రైతు వ్యవస్థను మళ్లీ అమల్లోకి తీసుకురావాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తోంది. అంతేకాక రాజకీయ కోణంలో చూస్తే రైతుల్లో పట్టుపెంచుకునేందుకు ఇది దోహదపడుతుందని కాంగ్రెస్ సర్కార్ ఆశాభావంతో ఉంది. ఇదిలాఉంటే ఆదర్శ రైతుల నియామకాలతో వ్యవసాయాధికారులకు కాస్త ఉపశమనం కలగనుంది. తమకు అదనపు పనులు అప్పగిస్తుండడంతో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని వ్యవసాయాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డిజిటల్ సర్వే పనులపై ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

ఉమ్మడి జిల్లాలో వెయ్యి మంది...

సర్కార్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో దాదాపు వెయ్యి మంది ఆదర్శ రైతుల నియామకాలు జరగనున్నాయి. ఎంపిక చేసిన ఆదర్శ రైతులు పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే వ్యవసాయశాఖకు రైతులకు అనుసంధానంగా వ్యవహరిస్తారు. రైతు వేదికల ద్వారా రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలతో పాటు పంటల బీమా, ఇతర వ్యవసాయ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు గతంలో 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేసి రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో క్లస్టర్‌కు ఒక వ్యవసాధికారి(ఏఓ)ని నియమించారు. అయితే కొన్ని చోట్ల శాస్త్రీయంగా జరగలేదు. రంగారెడ్డి జిల్లాలో 87, వికారాబాద్‌లో 99, మేడ్చల్ జిల్లాలో 9 క్లస్టర్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం 195 క్లస్టర్లు ఉన్నాయి. అయితే సాగు భూములను పరిగణనలోకి తీసుకుంటే అదనంగా 20 నుంచి 25 క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు వికారాబాద్ జిల్లాలో 5.81లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. దీని ప్రకారం చూస్తే వికారాబాద్ జిల్లాలో మొత్తం 116 క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ప్రస్తుతం 99 క్లస్టర్లు మాత్రమే ఉన్నాయి. ఇంకా అదనంగా 17 క్లస్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

గతంలో ఇలా..

వైఎస్ హయాంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆదర్శ రైతు వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. రైతులకు, వ్యవసాయ అధికారులకు అనుసంధానంగా పనిచేసేందుకు వ్యవసాయంలో మంచి పట్టు ఉండి కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఉన్న రైతులను ఎంపిక చేసి ఆదర్శ రైతులుగా నియమించింది. వీరికి 20 రకాల బాధ్యతలను అప్పగించారు. 250 నుంచి 300 ఎకరాలకు ఒక ఆదర్శ రైతును నియమించారు. అప్పట్లో గౌరవ వేతనం కింద వీరికి నెలకు రూ.1000 అందించేవారు. రైతులకు వీరి సేవలు ఎంతో ఉపయోగపడ్డాయి. పదేళ్ల పాటు కొనసాగిన ఆదర్శ రైతు వ్యవస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం 2017లో రద్దు చేసింది. తిరిగి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ వ్యవస్థను పునర్నిర్మించేందుకు కసరత్తు చేస్తోంది. ఆదర్శ రైతులకు రూ.3వేల వరకు గౌరవ వేతనం ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- త్వరలోనే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాలన విజయోత్సవాల వేడుకల్లో భాగంగా ఆదివారం ఆయన యాలాల మండలంలోని కోకట్, రాఘవాపూర్, కమాల్‌పూర్, నాగసముందర్, రాస్నం, గంగసాగర్, అచ్యుతాపూర్, ముద్దాయిపేట్ గ్రామాల్లో సీసీరోడ ప్రారంభోత్సవం, శంకస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్సు, రైతు రుణ మాఫీ, వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. త్వరలోనే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌త సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, బాల్‌రెడ్డి, అక్బర్‌బాబా, భీమప్ప, సంగెం హన్మంతు, అమృతయ్య, రాజు, సత్యనారాయణరెడ్డి, రఘురాంరెడ్డి, అమర్‌నాథ్, బస్వరాజ్, అధికారులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

నేడు ఎమ్మెల్యే పర్యటన

తాండూరు రూరల్: ఏడాది ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా నేడు(సోమవారం) తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించనున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్ప పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎమ్మెల్యే పర్యటన కొనసాగనుంది.

ఫార్మాసిటీ రద్దుకు శాంతియుత పోరాటం

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ



కాజుపల్లిలో పర్యటిస్తున్న నాయకులు, రైతులు

యాచారం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో విషపూరితమైన ఫార్మాసిటీని రద్దు చేసేదాకా శాంతియుతంగా పోరాటం చేస్తామని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు ప్రకటించారు. గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం పేదల భూములు తీసుకుంటే.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దు చేస్తామని నయవంచన చేసిందని మండిపడ్డారు. ఆదివారం అయా గ్రామాలకు చెందిన 120 మందితో కూడిన బృందం రెండు బస్సుల్లో పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతాల్లో, సంగారెడ్డి జిల్లా కిష్టయపల్లి, కాజుపల్లి, గడ్డపోతారం, పాషామైలారం తదితర గ్రామాల్లో పర్యటించింది. గ్రామాల రైతులను కలిసి వారి గోడు ఆలకించారు. విషపూరితమైన కంపెనీల నుంచి వెలువడే నీటితో చెరువులు, కుంటలు, భూగర్భజలం కలుషితమైందని కాజుపల్లి, గడ్డపోతారం పాషామైలారం గ్రామాల రైతులు తెలిపినట్లు వారు నాయకులు తెలిపారు. తమ ప్రాణం పోయినా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాకంపెనీలు ఏర్పాటు చేయనివ్వబోమని ఫార్మాసిటీ వ్యతిరేకపోరాట కమిటీ కన్వీనర్ కవుల సరస్వతి, సభ్యులు మహిపాల్‌రెడ్డి, బర్లమల్లేష్ తదితరులు తెలిపారు. ఫార్మాసిటీ రద్దుకు విపక్షాలు తమకు మద్దతు ఇవ్వాలని కోరారు. త్వరలో ఫార్మాసిటీ రద్దుకు ఉద్యమం లేవదీస్తామని తేల్చి చెప్పారు.

కులగణనకు న్యాయం చేయండి



కార్యక్రమంలో బీసీసేన నాయకులు

షాద్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన చేయడాన్ని సమర్థిస్తున్నామని, ఆచరణలో అందరికీ న్యాయం చేసేలా దానిని అమలు చేయకుంటే ఫలితం ఉండదని వివిధ పార్టీల నాయకులు సూచించారు. ఆదివారం షాద్‌నగర్ నియోజకవర్గంలో బీసీసేన ఆధ్వర్యంలో కులగణనపై పార్టీల నాయకులతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలా పేపర్లకే పరిమితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికార పార్టీకి చెందిన బీసీలదేనని అన్నారు. ఎన్నికలప్పుడు ఓట్లు, డబ్బులు పంచడానికే మనమే కావాలి కానీ, సీటు మాత్రం రాదని, ఇదెక్కడి న్యాయమని, బీసీల కుర్చీలపై అగ్రకులాల కబ్జా ఇంకెన్నాళ్లు అని అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబయ్య, బీజేపీ జాతీయ అధ్యక్షులు బర్కకృష్ణయ్య, రాజ్యాంగ పరిరక్షణ సమితి అధ్యక్షులు రాము, కాంగ్రెస్, బీఆర్ఎస్, టీఎస్పీ, డీఎస్పీ నాయకులు నర్సింగ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సిహ మాదిగ, బీసీసేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రశాంత్, రాజు, నరేష్, మల్లేష్, కృష్ణ, రాజునాయక్, వికలాంగుల సంఘం, బీసీసేన తదితరర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలది విష ప్రచారం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పదేళ్ల కష్టాలకు విముక్తి లభించి తమకు మేలు జరుగుతుందని రైతులు ఆనందంగా ఉంటే.. విపక్షాలు జీర్ణించుకోలేక విషప్రచారాలు సాగిస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. అధికారంలోకి వచ్చిన పది నెలల్లో రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత దేశ చరిత్రలో కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కడ్తాల మండలం మైసిగండి ఎంఆర్‌జీ గార్డెన్‌లో ఆదివారం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి బీడు భూములకు సాగునీరందించడానికి సీఎం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హీరాసింగ్, ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ అనంత రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జవహర్‌లాల్ నాయక్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, తదితరులున్నారు.

జిల్లా కేంద్రంలో గురుకులాలు అధ్వానం


విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గురుకులాలు అధ్వాన్నంగా మారాయని, విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు, జిల్లా ఇన్‌చార్జి జంగయ్య అన్నారు. బీఆర్ఎస్వీ నాయకులతో కలిసి ఆదివారం అనంతగిరిపల్లి, కొత్తగడి, మైనార్టీ గురుకుల పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో గతంలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని అధికారులు, పాలకులు సైతం సందర్శించినా పరిశుభ్రత లేదని, మరుగుదొడ్లు, కిచెన్ సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని పాఠశాలలో కావాలని లోపలికి వెళ్లనివ్వడం లేదని మండిపడ్డారు. ఇంకా ప్రైవేటు భవనాల్లో వసతి గృహాలు కొనసాగుతున్నాయని వాటికి పక్కాభవనాలు నిర్మించాలని కోరారు. విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్వీ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంచన్‌పల్లి సురేష్, కృష్ణ, సురేష్, రాజు, వరుణ్, ఫేరోజ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులు పూర్తి చేయాలి

ఘట్‌కేసర్‌లో స్థానికుల రిలే నిరాహార దీక్షలు


రిలే నిరాహార దీక్షలు చేపట్టిన స్థానికులు

ఘట్‌కేసర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో నత్తనడకన నడుస్తున్న రైల్వేవంతెన నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గత 15సంవత్సరాల నుంచి వంతెన నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా వంతెన పనులు పూర్తవడంలేదని, తక్షణమే పనులు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఘట్‌కేసర్ పట్టణం మీదుగా ఆర్టీసీ బస్సులు రాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా దీక్షాశిబిరాన్ని బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా ఆయా పార్టీల నాయకులు మాట్లాడుతూ.. వంతెన నిర్మాణంపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి పనులు ప్రారంభించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఫోర్త్‌సిటీతో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న కేఎల్లార్

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో నిర్మించతలపెట్టిన ఫోర్త్‌సిటీతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, ఓఆర్ఆర్ నుంచి 300 ఫీట్ల రోడ్డు వల్ల రైతుల భూములకు ఊహించని రీతిలో ధరలు పెరుగుతాయని, దీనిపై విపక్షాలకు అవగాహన లేక విమర్శలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. ఆదివారం కందుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్కశాతం భూమి రోడ్డు మార్గానికి పోయినా.. వేల ఎకరాల భూములకు పదింతల ధరలు పెరిగి రైతులు కోటీశ్వరులవుతారని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు ఫోర్త్‌సిటీ అభివృద్ధిపై అవగాహన లేకపోవడం వల్ల అన్నదాతలను రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారని.. ఇది మంచిది కాదని మండిపడ్డారు. భవిష్యత్తు తరాల అవసరాల దృష్ట్యా పెద్దరోడ్డులోనే మెట్రో, అండర్‌గ్రౌండ్ పవర్, డ్రైనేజీలు వేస్తామని వివరించారు. విపక్షాల నాయకుల మాయమాటలు నమ్మి మోసపోరాదని రైతులను కోరారు. విపక్షాల కారణంగా అభివృద్ధికి దూరం కావద్దని చెప్పారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా మార్కెట్ ధరతో పాటు రైతులకు ఆమోదయోగ్యమైన ఇంటి స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని తెలిపారు.


మెరిట్ సాధించడానికి సరిహద్దులుండవు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణ ప్రదీప్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెరిట్ సాధించడానికి ఎలాంటి సరిహద్దులుండవని ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ శ్రీకృష్ణ ప్రదీప్ అన్నారు. ఇబ్రహీంపట్నంలోని విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో వింగ్స్ మీడియా, జీస్ మీడియా గ్రూప్‌తో కలిసి ఆదివారం 'మొదటి ప్రయత్నంలో సివిల్ సర్వీసెస్ సాధించడం ఎలా' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ ప్రదీప్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్‌ను ఉదహరిస్తూ మాట్లాడారు. మహిళా అధికారిగా ఆమె సమాజానికి తెలంగాణలో పదేళ్ల పాటు విశేషమైన సేవలందించారని తెలిపారు. ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చీఫ్ మెంటార్ డాక్టర్ భవానీ శంకర్ మాట్లాడుతూ యూపీఎస్సీ పరీక్షల్లో ప్రాథమిక పాఠశాల ప్రశ్నలు ఉంటాయని, క్లిష్టమైన ప్రశ్నలతో కూడుకున్నదనే అపోహ వీడాలని తెలిపారు. కళాశాల చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో సివిల్ ఆస్పిరెంట్స్ క్లబ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించారు. సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్ జనార్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అస్తవ్యస్తంగా పాలన


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రత్నం

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఒక మాట మాట్లాడితే.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరో మాట మాట్లాడుతున్నారని.. ఇక మంత్రులు ఏం మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా సాగుతోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కేఎస్ రత్నం మండిపడ్డారు. ఆదివారం మండలంలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలోని కంజర్ల ప్రకాష్ కార్యాలయంలో బీజేపీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశంలో రత్నం మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీని ఇచ్చిందని.. అమలు చేయకముందే కొత్తగా పథకాలను తీసుకువస్తామని ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును తీసుకువచ్చి పనులు ప్రారంభించి మధ్యలోనే నిలిపి వేసిందని. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇటువైపు కన్నెత్తి చూడలేదని.. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా దాని పేరే ఎత్తడం లేదని ప్రజలు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని రేపటి(సోమవారం)నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల, డివిజన్ స్థాయి అధికారులకు మెమోరాండం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, తదితరులున్నారు.

అమ్మపాటే స్ఫూర్తి

- ఆమె పాటలు వింటూ పెరిగా
- గతంలో లెక్చరర్ ప్రమాదంతో రచయితనయ్యా
- సమాజ శ్రేయస్సు, సంస్కృతిని తెలిపేలా రచనలు
- యూట్యూబ్ చానల్ నిర్వహణ, నటనతో ముందుకు
- నేడు పాటల రచయితగా ప్రత్యేక గుర్తింపు
- మట్టిలో మాణిక్యం బేగరి రాములుపై స్పెషల్ స్టోరీ


గొర్లకాసే మామ కొడుకా సాంగ్ షూటింగ్‌లో టీం సభ్యులతో బేగరి రాములు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జైదుపల్లికి చెందిన రాములు ఎంఏ బీఈడీ పూర్తిచేసి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేశారు. అయితే ఆయన చిన్నప్పటి నుంచి అమ్మ పాటలు వింటూ పెరగడంతో వాటిపై మక్కువ పెరిగింది. బీఎడ్ చేసే సమయంలోనే పాటలు రాయడం మొదలుపెట్టారు. తొలిపాట బతుకమ్మపై రాశారు. అదే సమయంలో ఓ ప్రమాదంలో రాములు కాలుకు తీవ్రగాయమైంది. కాలికి ఆపరేషన్ చేసిన డాక్టర్లు ఎక్కువసేపు నిలబడొద్దని సూచించారు. దీం తో రాములు లెక్చరర్ వృత్తికి స్వస్తి పలికారు. ఈ క్రమంలో తనకిష్టమైన పాటలు రాయడానికి పూర్తి సమయాన్ని కేటాయించారు. అమూల్య చానల్‌కు తొలిసారి రాసి పాడిన బతుకమ్మ పాటకు మంచి స్పందన వచ్చింది. ఆ పాటకు 3.5మిలియన్ల వ్యూస్ రావడంతో రాములుకు పాటలు పాడాలనే ఆసక్తి మరింత పెరిగింది.

సొంతంగా చానల్..

ఇతర చానళ్లకు పాటలు రాసేబదులు సొంతంగా తన కంటూ ఓ చానల్ ఉంటే బాగుంటుందని రాములుకు ఆలోచన చేశారు. దీంతో వీఆర్5(వికారాబాద్ రాములు 5) పేరుతో చానల్ పెట్టి 'గొర్లుకాసే మామ కొడుకా' అనే ఫోక్ సాంగ్, 'జెమ్మా జెమా జెమాదండా' మొహర్రం పాట, 'పొద్దు పొడుపుల్లోనే ఉదయించే సూర్యుడా' అంబేడ్కర్ సాంగ్, తన తల్లి చిన్నప్పుడు పాడిన పాట 'అల్లో నేరడల్లో' కొట్నం పాట, మహిళల రక్షణ కోసం.. 'రక్షణలేని దేశంలోకి నన్నెందుకిచ్చావు శివుడా?' కుటుంబ బంధం వివరించే 'రఘుమల్లెల్లో రామా' పాట, అల్లో నేరడల్లో బతుకమ్మ పాటలు పాడి అలరించారు. తాజాగా 'భగవంతా నా రాతెట్ల రాశావు? పేదవాడిగా నన్ను ఎందుకు పుట్టించావు?' అనే పాటను రాసి విమర్శకుల ప్రశంసలు పొందాడు.

బాలికలపై జరిగిన అఘాయిత్యాలకు చలించి..

ప్రమాదం తరువాత ఇంట్లో ఉంటున్న రాములును వరంగల్‌లో జరిగిన ఓ మైనర్‌పై జరిగిన అఘాయిత్యం, జమ్మూ కశ్మీర్‌లో జరిగిన మరో ఘటన కలిచి వేశాయి. 'కూర్చున్న స్థానంలోనే రాలుతున్నయమ్మా పువ్వులు' అనే పాటను రాసి అశ్విని అఫీషియల్ అనే చానల్‌కు అందించాడు. ఆ పాటను ఏకంగా ఏడు లక్షల మంది చూసి రాములు పాటకు పట్టం కట్టారు. ప్రతి నోటా ఈ పాట వినిపించేలా చేసింది.

ప్రతిభకు పురస్కారం

తాజాగా ధనికుడికి పేదవాడికి మధ్య ఉన్న అంతరాన్ని వివరిస్తూ పాడిన పాట 'భగవంతా నా రాతెట్ల రాశావు'కు మంచి ఆదరణ లభిస్తోంది. ఈ పాటకు సృజన ఆర్ట్స్ క్రిషియన్స్ అవార్డు వరించింది. ఆ పాటలో రాములు స్వయంగా నటించి మెప్పించారు. ప్రస్తుతం యువత ప్రేమ పాటలు, డీజే సాంగ్స్‌పై మక్కువ చూపిస్తున్నా.. సమాజంలో జరుగుతున్న సంఘటనలు, మార్పులు, సంస్కృతి సంప్రదాయాలను గుర్తుచేసేలా పాటలు పాడుతూ రాములు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే రాములును పుడమి సాహితీ వేదిక ద్వారా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారం కూడా వరించింది.

అమ్మ బతికుంటే గొప్ప సింగర్‌ను చేసేవాడిని



చిన్నప్పుడు అమ్మ పాడిన పాటలు వింటూ పెరిగా. ఇప్పుడు అమ్మ ఉంటే ఆమెను పెద్ద సింగర్ చేసేవాడిని. కానీ ఆ అవకాశం ఇప్పుడు ఎంతోమందికి ఇస్తున్నా. నా కొడుకు అవినాష్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వాడికీ పాటలంటే ఇష్టం. ఇకముందూ సమాజానికి ఉపయోగపడే పాటలే రాయాలని ఉంది. బతుకమ్మ పాటలు అంటే సిరిసిల్ల, కరీంనగర్ ఇతర ప్రాంతాలే అనుకుంటారు. కానీ మన వికారాబాద్ కూడా అందులోభాగమే అనేలా పాటలు రాస్తున్న. హైదరాబాద్‌కు వికారాబాద్ సమీపంలోనే ఉంది. అయినా వికారాబాద్ వారు ఉన్నారు. వికారాబాద్ గురించి ప్రతీ ఒక్కరికి తెలిసేలా వికారాబాద్ గొప్పతనంపై నాయకులను మేల్కొపేలా పాటలు రాయాలని ఆలోచిస్తున్నా. ఆ దిశగా ముందుకు వెళుతున్న. వీఆర్5 చానల్‌కు ప్రస్తుతం 21వేలకుపైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఇప్పటి వరకు 5మిల్లియన్ల వ్యూస్ ఉన్నాయి. ఇక ముందు కూడా మంచి పాటలతో మీ ముందుకు వస్తా.

- బేగరి రాములు, పాటల రచయిత, జైదుపల్లి

స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలి

ఆమనగల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసి ఇచ్చిన మాటను నిలుపుకోవాలని ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 317 జీవో లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయడానికి ఏర్పాటు చేసిన సబ్ కమిటీ నివేదికలో స్థానికత అంశం లేకపోవడం విచారకరమన్నారు. సంబంధం లేని స్పౌజ్, మ్యూచువల్, మెడికల్‌కు సంబంధించిన జీవోలు విడుదల చేయడాన్ని వారు ఖండించారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె. మల్లేశ్, నాగర్‌కర్నూల్ జిల్లా బాధ్యులు శ్రీనివాస్, కార్యదర్శి అలివేలు, సభ్యులు కల్పన, శ్రీను, చంద్రశేఖర్, నర్సింహ, సత్యారాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

31వ రోజుకు చేరిన రిలే దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు ఆందోళన ఉధృతం చేశారు. మండల కేంద్రంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు కోసం జేఏసీ ఆధ్వర్యంలో గట్టిప్పలపల్లి గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 31వ రోజుకు చేరాయి. దీక్షల్లో జేఏసీ నాయకులు, గ్రామ నేతలు కూర్చున్నారు. దీక్షలకు సంఘీబావంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్ చంద్ర, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులతో మారనున్న పాలమూరు రూపురేఖలు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక నిధులతో ఉమ్మడి పాలమూరు జిల్లా రూపురేఖలు మారుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈమేరకు రైతు పండగ సభలో సీఎం నిధులు కేటాయించనున్నట్లు ప్రకటించడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించనున్న రూ.20వేల కోట్లతో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శంకర్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు మిగిలింది అప్పులు, ఆత్మహత్యలేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రూ.21వేల కోట్ల రుణమాఫీ చేయడం ఉమ్మడి ఏపీ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. గతంలో సోనియాగాంధీ నేతృత్వంలో ప్రధని మన్‌మోహన్‌సింగ్, అప్పటి సీఎం వైఎస్ఆర్ దేశవ్యాప్తంగా రూ.70వేల కోట్ల రుణమాఫీ చేశారని, సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే రూ.21వేల కోట్ల రుణమాఫీ చేయడం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరిగి వ్యవసాయం వైపు పూర్తి దృష్టి సారిస్తున్నారని చెప్పారు. పాలమూరు జిల్లాకు ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంతో పాటు, లక్ష్మిదేవిపల్లి రిజర్వాయర్, నారాయణపేట, తదితర ప్రాజెక్టులపై సీఎం దృష్టి కేంద్రీకరించనున్నట్లు పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేసిన బీఆర్ఎస్ దీక్షా దివస్ వంటి కార్యక్రమాలు చేపట్టడం సముచితం కాదన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, నేతలు రఘు నాయక్, చెంది తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మైసిగండి ఆశ్రమ పాఠశాల విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి కబడ్డీ, చెస్ పోటీలకు ఎంపికయ్యారు. రామావత్ రాజేందర్, గౌతమ్, ప్రదీప్‌లు అండర్-14 కబడ్డీ, సిద్దు చెస్ పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం హెచ్ఎం బాల్‌రాజ్ అధ్యక్షతన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అతిథిగా హాజరై ఎంఈవో సత్యనారాయణ, మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్‌లతో కలిసి విద్యార్థులను సత్కరించి అభినందించారు.


ధారూరులో నిర్వహించిన సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వడ్ల నందు

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

బంట్వారం (కోట్‌పల్లి)డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి విమర్శించారు. బంట్వారం, కోట్‌పల్లి మండల కేంద్రాల్లో ఆదివారం బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. రైతులు పంటల పెట్టుబడులకు వడ్డీకి అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తున్నారని, దీనికి తోడు అధిక వర్షాలు పడడంతో రైతులు వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు. వారికి కనీసం ప్రభుత్వం రైతుబంధు వేసి ఉంటే బాగుండేదన్నారు. రుణమాఫీ కోసం ఎంతోమంది రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా హామీల అమలు చేయడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్, కృష్ణయాదవ్, రొంపల్లి మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు మల్లేశం, శరణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, బంట్వారం మండలంలోని సల్బత్తాపూర్ గ్రామానికి చెందిన ఎక్కెలి రామయ్య మృతిచెందగా ఆయన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.4వేలు అందజేశారు.

ధారూరులో బీజేపీ బైక్ ర్యాలీ

ధారూరు: ఆరుగ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యంపై బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ధారూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ ఆలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు పార్టీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో జరిగిన సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాదవరెడ్డి, నాయకులు పాండుగౌడ్, రమేశ్, రాజునాయక్, వి.నందు, రాజేందర్‌గౌడ్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గారడీ, 66 మోసాలుగా రేవంత్‌రెడ్డి పాలన ఉందని విమర్శించారు.

గత ప్రభుత్వ నిర్ణయాలకు రెవెన్యూ ఉద్యోగులు బలి

- రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి
- తూంకుంటలో వీఆర్‌వోల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకున్న అశాస్త్రీయమైన నిర్ణయాల వల్ల రెవెన్యూ ఉద్యోగులు బలయ్యారని, రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గరిక ఉపేందర్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయిలో పూర్వ వీఆర్వోల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వీఆర్వోల వ్యవస్థను బలోపేతం చేస్తామని అన్నారు. ఇదివరకు వీఆర్వోలుగా చేసిన వారిని తిరిగి యథావిధిగా వీఆర్వోలుగా విధుల్లోకి తీసుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి సుముఖంగా ఉన్నారని ఆయన వివరించారు. తాను రాష్ట్రంలోని ప్రతి ఒక్క రెవెన్యూ ఉద్యోగికి తప్పని సరిగా అండగా ఉంటానని అన్నారు. తనను పక్కకు పెట్టడానికి గత బీఆర్ఎస్ పాలకులు ఎన్నో కుట్రలు పన్నారని ఆరోపిస్తు ఆయన విచారం వ్యక్తం చేశారు.

గత పాలకుల కుటిల ప్రయత్నం

వీఆర్వోలు చేసిన తప్పులు చాలా చిన్నవని వారిని రాబందులా, రాక్షసుల్లా గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలకులు చిత్రీకరించారని ధ్వజమెత్తారు. తనను రెవెన్యూ శాఖ నుంచి తప్పించడానికి ఎన్నో కుటిల ప్రయత్నాలు చేశారని ఆందోళన వ్యక్తంచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ సంఘాల నేతలు పాలకుల అడుగులకు మడుగులు వత్తి ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో ఆదాయం ఎలా పెంచుకోవాలో తాను వివరంగా సీఎం రేవంత్‌రెడ్డికి, ఇతర మంత్రులకు వివరించినట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలకు, మండలాలకు మధ్య వారధిగా ఉండే విధంగా అడిషనల్ ఆర్ఐగా వీఆర్వోలను విధులోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరినట్లు లచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పీవీ మోహన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, ప్రధాన కార్యదర్శి పాండునాయక్, తదితర నాయకులు, రాష్ట్రంలోని వివిధ మండలాలకు చెందిన వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మర్పల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-2006 సంవత్సరం పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు.

ప్రజల పట్ల గౌరవంగా మెలగాలి

కులకచర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల గౌరవంగా మెలగాలని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కులకచర్ల పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పీఎస్ పరిధిలోని ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా ప్రజలతో మాట్లాడాలని తెలిపారు. అదే విధంగా వ్యాపారులు వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐ అన్వేష్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అన్నదాతల్లో తుఫాన్ టెన్షన్!

- కొనుగోలు కేంద్రాలు, కల్లాల్లో ధాన్యం కుప్పలు
- టార్పాలిన్ షీట్లు కప్పిన రైతులు

వికారాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ బొంరాస్‌పేట్, డిసెంబరు 1: ప్రతీ ఏడాది వరి కోతల సమయంలో తుపాన్లు, అకాల వర్షాల రూపంలో రైతులు నష్టపోతున్నారు. ఈసారి ఫెయింజల్ తుఫాన్ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. రెండు రోజులుగా ఆకాశమంతా మబ్బులతో కప్పేసి వాతావరణం పూర్తిగా చల్లపడడంతో ఎప్పుడు ఏముప్పు వచ్చి పడుతుందోనని రైతుల్లో ఆందోళన నెలకొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావంతో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తుండగా, జిల్లాలో కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసిన నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాలు, కల్లాలోని ధాన్యం నిల్వలు వర్షానికి తడిసిపోయిన విషయం తెలిసిందే.

కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసే సమయంలో లేనిపోని కొర్రీలు వేయడం వల్ల ధాన్యం సేకరణలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఈసారి 1.05లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకుని 126కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా, ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి శనివారం జిల్లాలో 12,260మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం సకాలంలో తూకం కాకపోవడంతో విక్రయించేందుకు తీసుకు వచ్చిన ధాన్యాన్ని రైతులు అక్కడే ఆరబెట్టుకుంటున్నారు. కాగా, తుఫాన్ కారణంగా వాతావరణ శాఖ అధికారుల ముందస్తు హెచ్చరికలతో రైతులు అప్రమత్తమయ్యారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో వికారాబాద్ జిల్లా కూడా ఉండడంతో తమ పంటలు ఏమవుతాయోనన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు టార్పాలిన్ షీట్లు కప్పి ఉంచారు. అయితే భారీ వర్షం కురిస్తే ధాన్యం తడిసే అవకాశముందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి సాగు చేసిన రైతులతో పాటు మొక్కజొన్న, కంది, పత్తి, ఇతర పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల కూలీల కొరత కారణంగా పత్తి తీయడం ఆలస్యమవుతోంది. ఈ సమయంలో వర్షం కురిస్తే తాము తీవ్రంగా నష్టపోతామంటూ పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు.



బొంరాస్‌పేట్: ధాన్యం కుప్పలపై కప్పి ఉంచిన టార్పాలిన్ షీట్లు

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కీసర రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓవ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన శరన్‌రాయ్(37) నాగారం మున్సిపాలిటీలోని ఓమార్బుల్ షాప్‌లో పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. శనివారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శరన్‌రాయ్‌ను ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన శరన్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ పట్టణంలో గంజాయి రవాణాతో పాటు విక్రయిస్తున్న ఓవ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్‌చేశారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన అఖిల్‌పాషా గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ పోలీసులు అతడిని వికారాబాద్ రైల్వే ఆస్పత్రి ఆవరణలో శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 210 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అఖిల్ పాషాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాస్, ఎక్సైజ్ సీఐ రాఘవీణ, ఎస్ఐలుప్రేమ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంతు, శివప్రసాద్, దస్తగిరిలను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ అభినందించారు.

ప్రజాపాలన విజయోత్సవాలు ప్రారంభం



శామీర్‌పేట: తూంకుంటలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ వెంకటగోపాల్



తాండూరు: ముగ్గులు వేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

శామీర్‌పేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్‌లో ఆదివారం ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని కమిషనర్ వెంకటగోపాల్ ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ రైజింగ్ పేరుతో కమిషనర్ పెద్దఎత్తున బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలో మున్సిపల్‌చైర్మన్ రాజేశ్వర్‌రావు, కమిషనర్ వెంకటగోపాల్‌లు ఉచిత మెగాహెల్త్ క్యాంపులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో ఆదివారం ప్రజాపాలనా విజయోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా నాగారంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు, కౌన్సిలర్లు కలిసి ప్రధాన రహదారుల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. అదేవిధంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలో ఓల్డ్ విలేజ్ నుంచి పోచమ్మ గుడి వరకు దారిని శుభ్రం చేశారు. వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, కౌన్సిలర్లు కలిసి దారిలోని చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తాండూరు: పట్టణంలో గార్బేజి వల్నరబుల్ పాయింట్స్ (జీవీపీ) ప్రాంతాల్లో శుభ్రంచేసి ముగ్గులు వేసి చెత్త వేయొద్దని సూచించారు. 6వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న చెత్త పాయింట్ల వద్ద ముగ్గులు వేసి ప్రజాపాలన విజయోత్సవాలను ప్రారంభించారు. అనంతరం 4, 24, 27 వార్డుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విక్రం సింహారెడ్డి, డీఈ మణిపాల్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు బోయ రవి, బీంసింగ్, సంగీతాఠాకూర్, ఈఈ ప్రవీణ్‌గౌడ్, వెంకటయ్య, అశోక్ కుమార్, యాదగిరి, రవీందర్, సంగమేశ్వర్, కపిల్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ కొండాపూర్‌రోడ్డును మున్సిపల్ సిబ్బందితో కలిసి శుభ్రం చేసి ప్రజాపాలన విజయోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శశికళ, స్థానికులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బంట్వారం: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండల వనరుల కేంద్రంలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆదివారం 'పునరుత్పాదక శక్తి వనరులు' అనే అంశంపై విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి పి.వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: మండల వనరుల కేంద్రం ఆవరణలో విద్యాశాఖ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో షఫీఉల్లా, సీఆర్‌పీలు రాజశేఖర్, రవి, సత్యనారాయణ, అంజయ్య, మీనాక్షి పాల్గొన్నారు.

నవాబుపేట: జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో 25మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థుల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్ రెహిమాన్, ఉపాధ్యాయులు శివకుమార్, బాలేశ్వర్‌రావు పాల్గొన్నారు.

దోమ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన విజయోత్సవ దినోత్సవం సందర్భంగా ఆదివారం మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్ పాల్గొన్నారు.

కొడంగల్: స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 80మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, ఇన్‌చార్జి హెచ్ఎం శ్యామలమ్మ, మురళీధర్, హాస్టల్ వార్డెన్ హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చౌదర్‌పల్లి, రేగడిమైలారం, బొట్లవనితండా ఆశ్రమ పాఠశాల తదితర పాఠశాలల విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, అనిల్‌కుమార్, కాశయ్య పాల్గొన్నారు.

పూడూరు: ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా ఆదివారం నిర్వహించిన మండలస్థాయి వ్యాసరచన పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 60మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఎంఈవో సాయిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ రత్నమ్మ, చెన్‌గోముల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం హన్మంత్‌రెడ్డి ఉన్నారు.

యాలాల: మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి 50మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మహిపాల్‌రెడ్డి, సుధాకర్, సంగమేశ్వర్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

పరిగి: జడ్పీహెచ్ఎస్ నెం.01 పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు ఎంఈవో గోపాల్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంలు ఎం.అంజయ్య, శంకర్, బాలయ్యరమాపతి తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు పాల్గొన్నారు.



యాలాల: వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవో, హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎయిడ్స్ నివారణపై అవగాహన ఉండాలి



ఘట్‌కేసర్: ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

తాండూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నివారణపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ రవీంద్ర యాదవ్ అన్నారు. ఎయిడ్స్‌డే పురస్కరించుకొని 'టేక్ రైట్ పాత్' అనే నినాదంతో ఆదివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ప్రతినిధులు వెంకటేష్, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో గల శ్రీనిధి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రపంచ ఎయిడ్స్‌డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డులోని యంనంపేట్ చౌరస్తా నుంచి ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

పరిగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ తొలి అమరుడు పోలీసు కిష్టయ్య ముదిరాజ్ 16వ వర్ధంతిని ఆదివారం పరిగి ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో పరిగిలోని పందుగల సాయన్న విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. అమరుడు కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిగి మునిసిపల్ చైర్మన్ అశోక్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: కిష్టయ్యకు మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం మండల నాయకులు నర్సింహులునాయుడు, అంజిలయ్య, కమ్మరి నారాయణ, తిరుపతయ్య, రాంచంద్రయ్య ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు బాబయ్యనాయుడు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి సందర్భంగా కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరవెంకటయ్య ముదిరాజ్, కొడంగల్ మండల సంఘం అధ్యక్షుడు బోయిని వెంకటయ్యముదిరాజ్ పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శేఖర్, జగతి అశోక్, బాల్‌రాజ్, వెంకటయ్య, హన్మంతు, కిష్టయ్య పాల్గొన్నారు.

మాలల ఆత్మగౌరవం కోసం పోరాటం

పరిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాలల ఆత్మగౌరవం కోసం పోరాటం చేస్తామని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు బి.వెంకటయ్య అన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పిలుపు మేరకు సుల్తాన్‌పూర్ వెంకటయ్య ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో జరిగిన మాలల సింహగర్జనకు పరిగి నుంచి భారీగా తరలివెళ్లారు. అంతకుముందు పరిగిలోని కొడంగల్ చౌరస్తాలోని పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ముత్తయ్య, నర్సింహులు, విజయ్, యాదయ్య వెంకటయ్య పాల్గొన్నారు. బీఎంపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, నాయకులు రవీందర్, ఆనంద్‌నాయక్, గణేశ్ మద్దతు పలికారు.

ధారూరు: చలో హైదరాబాద్ కార్యక్రమానికి ధారూరు నుంచి మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. ధారూరులోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మాల మహానాడు నాయకులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాలలతో కలిసి హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభకు తరలివెళ్లారు. మాల మహానాడు నాయకులు బి.వెంకటేశం, రాజు, చెన్నయ్య, మహేష్ కుమార్, శివరాజ్, గోపాల్ పాల్గొన్నారు.

తాండూరు: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జనకు తాండూరు నుంచి బస్సులు, కార్లు, జీప్‌లలో పెద్దఎత్తున తరలివెళ్లారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ చౌక్ నుంచి ఇందిరాచౌక్ వరకు మాలమహానాడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఆలయంలో సహస్ర దీపాలంకరణ



దీపారాధన చేస్తున్న మాజీ కౌన్సిలర్ లక్ష్మీకాంత్‌రెడ్డి

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగింపు సందర్భంగా వికారాబాద్ సమీపంలోని ఆలంపల్లి శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి దేవాలయంలో అర్చకుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సహస్ర దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రత్యేక వేడుకల్లో మాజీ కౌన్సిలర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, గ్రామ పెద్దలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కొడంగల్: అమావాస్య సందర్భంగా ఆదివారం కొడంగల్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూలంగి సేవలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

టీఎస్‌యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పరిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో 14వ తేదీన నిర్వహించనున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఐదో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరత్న, రాములు తెలిపారు. పరిగిలో ఆదివారం మహాసభల నిర్వహణ కమిటీ కన్వీనర్ జాఫర్‌పల్లి వెంకటయ్య అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మహాసభలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభల ఆహ్వాన కమిటీ అధ్యక్షుడిగా సదానందం, ఉపాధ్యక్షుడు వెంకటయ్య సభ్యులుగా వెంకట్‌రాములు, కరుణాకర్, అంజయ్య, మొగులయ్య, అనంతయ్య, మల్లేశం, శ్రీనివాస్, రఘురామ్, పెంటయ్య, అనిల్, నర్సమ్మ, రామకృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వెంకటయ్య, బాబురావు, జమున, బసప్ప, వినోద్, శేఖర్ పాల్గొన్నారు.

అలరించిన వంటల పోటీలు

వికారాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గౌలికార్ ఫంక్షన్‌హాల్‌లో ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హెచ్‌పీ పెట్రోలియం ఆధ్వర్యంలో 'మన వంట గది మన బాధ్యత' అనే కార్యక్రమం నిర్వహించి వంటలపోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో చాలా మంది మహిళలు పాల్గొని వివిధ రకాల వంటకాలు చేశారు. పట్టణానికి చెందిన నాగలక్ష్మికి మొదటి బహుమతి, అనితకు రెండో బహుమతి, వెన్నలకు మూడో బహుమతి రాగా వారికి వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున అందజేశారు.

ఆధ్యాత్మిక చింతనతో సమస్యల పరిష్కారం



వికారాబాద్: మాట్లాడుతున్న భాస్కర యోగి

పరిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆధ్యాత్మికవేత్త, రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి అన్నారు. పరిగిలోని శ్రీనివాస నగర్‌లో ఆదివారం జరిగిన మార్గశిర సత్సంగంలో ఆయన ప్రసంగించారు. విస్తరిస్తున్న పాశ్చత్య విష సంస్కృతీ వల్ల మానసిక ప్రశాంతతలోపిస్తుందన్నారు. ప్రతీ హిందువు హైందవ ధర్మాన్ని ఆచరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్లు ఎందరైనా దైవత్వం ఒక్కటే

వికారాబాద్: దేవుళ్లు ఎందరైనా దైవత్వం ఒక్కటేనని ప్రముఖ వక్త భాస్కర యోగి అన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని శ్రీ రామ మందిరంలో ఆధ్యాత్మిక మండలి ఏర్పాటు చేసిన రుద్రాభిషేకం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. హిందూ మతం గొప్పదని హిందూ మత ఔనత్యాన్ని తెలిపారు. అయితే గత 30 రోజులుగా కాశీ నుంచి తెచ్చిన గంగా జలంతో పట్టణంలోని ఆయా దేవాలయాల్లో రుద్రాభిషేకం నిర్వహించారు.

సర్వశాస్త్రాల సమ్మేళనం భగవద్గీత

సర్వ శాస్త్రాల సమ్మేళనం భగవద్గీత అని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బందప్పగౌడ్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు గీత జయంతి సందర్భంగా గీత కంఠస్థ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, శ్రీలతారెడ్డి, సంతోష, స్వప్న, ప్రియ, నర్సమ్మ, సుజాత, మాధురి, సుమాంజలి భారతి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి

నవాబుపేట: దుద్యాల మండలం లగచర్ల ఘటనలో అమాయక గిరిజనులపై నమోదు చేసిన కేసులను ఎత్తేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ కె.నాగభూషణం అన్నారు.. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల నుంచి భూములను ప్రభుత్వం బలవంతంగా సేకరించడం సరైంది కాదన్నారు. అదేవిధంగా దామగుండం అటవీ ప్రాంతం అగ్గిలా మారిపోయిందని, పచ్చటి అటవీ ప్రాంతంలో నిప్పుల కొలిమి అంటుకుందని చలికాలంలో ఏవిధంగా దగ్ధం అయిందో ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ వేసి నిజాలను ప్రజల ముందు పెట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. చేవేళ్ల ఎస్టీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేస్తూ పోడు భూములను గిరిజన రైతులు అమ్ముకునే, కొనుగోలు చేసే విధంగా హక్కు కల్పించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 7వ గ్యారంటీ ప్రజాస్వామ్యంలో భావప్రకటన స్వేచ్ఛసమానత్వం జీవించే హక్కును అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన పరిగి వాకర్స్

పరిగి: వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఎక్సలెంట్ మాస్టర్స్ అథ్లేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వివిధ విభాగాల పోటీల్లో పరిగి వాకర్స్ అసోసియేషన్ బృందం పాల్గొని ప్రతిభ చాటింది. 200 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పరిగికి చెందిన వి.రఘు 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. వివిధ పోటీల్లో లింగమయ్య, అనంతయ్య, హనుమంతు, అహ్మద్‌హైమద్ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. వికారాబాద్ మునిసిపల్ చైర్మన్ వీరికి బహుమతులు అందజేశారు.

మధ్యాహ్న భోజన నిర్వహణకు పరిష్కారం చూపాలి

బొంరాస్‌పేట్: మధ్యాహ్న భోజనం నిర్వాహణ నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని, నిర్వాహణకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని రేగడిమైలారం ఉన్నత పాఠశాలలో ఆదివారం సమావేశమై ఎస్టీయూ మండల ఉపాధ్యక్షుడిగా రమేశ్, లక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా అలీముద్దీన్, కోశాధికారిగా రతన్‌రాజ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, నాయకులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు చేయూత

కొడంగల్: అమ్మానాన్న ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్‌కుమార్ కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో ఆదివారం అనాథ విద్యార్థులు నవీన్, సురేశ్‌లకు కిరాణ సామగ్రిని అందజేశారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు

పరిగి: తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం.01 పాఠశాలలో ఆదివారం టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. నస్కల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ప్రథమ బహుమతి మౌనిక, ద్వితీయ బహుమతి గౌతమి, తృతీయ బహుమతి నిఖితలకు లభించింది.

విద్యార్థులు అన్ని రంగాలల్లో రాణించాలి

కీసర: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని బ్రిగేడియర్ ఎస్‌కే ప్రసాద్(వెటరన్) అన్నారు. కీసర పరిధిలోని రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులు తగు సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ మురళీ ముకుంద్, సెక్రటరీ దినకరన్, డైరెక్టర్ వరలక్ష్మి, ప్రిన్సిపల్ పద్మాజారావులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దోమ: మండలంలోని అయినాపూర్ గ్రామానికి పొట్ట ఎల్లమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న గ్రామ సమాజ సేవకులు భాస్కర్‌గౌడ్ ఆమె కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈడిగి రవికుమార్‌గౌడ్, నల్లసాయిలు, ఎర్ర రాములు, అంజిలయ్య పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఘట్‌కేసర్: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ఆయన ఆదివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా పలు కాలనీలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

ధారూరు మార్కెట్‌లో మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం మొక్కజొన్న, ధాన్యం కొనుగోళ్లు నిర్వహించారు. బీట్లలో మొక్కజొన్న క్వింటాలుకు రూ.2,400ల నుంచి రూ.2,500ల వరకు, ధాన్యం 1010 రకం క్వింటాలుకు రూ.2,200ల నుంచి 2,270ల వరకు, సోనా రకం క్వింటాలుకు రూ.2,665 నుంచి రూ.2780వరకు ధరలు పలికాయని మార్కెట్ కమిటీ అధికారి సిద్ధమ్మ తెలిపారు. మొక్కజొన్న 224.5 క్వింటాళ్లు, ధాన్యం 3,970 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయని ఆమె చెప్పారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

పరిగి: సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పరిగి మార్కెట్ పరిధిలోని మూడు జిన్నింగ్ మిల్లుల్లో రైతులు పత్తిని విక్రయించాలని పరిగి మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్‌కిషోర్ ఒక ప్రకటనలో కోరారు. పత్తి క్వాలిటీని బీటీ మోడ్ క్వింటాలుకు రూ.7,521, బీటీ స్పెషల్ రూ.7,471లు, మెక్ మోడ్ రూ.7,421లుగా ధర నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

పరిగి: పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నెం.02 2002, 2003 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పరిగిలోని బాలసదనంలో 30మంది పేద విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ పి.బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్, చైర్‌పర్సన్‌కు సమస్యలపై అవగాహన లేదు

తాండూరు: తాండూరు మున్సిపాలిటీ కమిషనర్ విక్రం సింహారెడ్డి, చైర్‌పర్సన్ స్వప్నలకు ప్రజా సమస్యలపై సరియైన అవగాహన లేదని 20వ వార్డు కౌన్సిలర్ సంగీత ఠాకూర్ ఆరోపించారు. గాంధీ నగర్‌లో పాడైన కబేలా గేటును వార్డు ప్రజల సహకారంతో ఆదివారం అమర్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కమిషనర్, చౌర్‌పర్సన్‌కు కౌన్సిలర్లు ప్రజా సమస్యలను సూచించినా పట్టించుకోని పరిస్థితుల్లో ఉన్నారని వారి తీరుపై మండిపడ్డారు.

బాల మల్లేశం మృతి సీపీఐకి తీరని లోటు

తాండూరు: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ హఠాన్మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ అన్నారు. ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు. ముగ్ధుంభవన్ రెడ్‌గార్డుగా పనిచేసిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారని తెలిపారు. బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బీసీ హక్కుల సాధన సమితికి ప్రధాన కార్యదర్శిగా బాల మల్లేశ్ పని చేశారని ఆమె గుర్తు చేశారు. తాండూరులో చేసిన ఎన్నో ఉద్యమాల్లోనూ బాల మల్లేశం పాల్గొన్నారని, ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

సర్కారు దూకుడు!

(5వ పేజీ తరువాయి)

కార్యాలయం పనివేళల్లో తనిఖీ చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో సూచించారు. నోటిఫికేషన్‌లో ఉన్న సర్వే నంబర్లలో ఏ భూమిలోకైనా ప్రవేశించి.. భూమిని సర్వే చేసి లెవెల్స్ తీసుకునేందుకు, సబ్ సాయిల్‌లోకి తవ్వడానికి, బోరు వేయడం వంటి చర్యలు తీసుకునేందుకు తాండూరు సబ్‌కలెక్టర్‌కు రాష్ట్ర ప్రభుత్వం అధికారం కట్టబెట్టింది. నోటిఫికేషన్ జారీచేసిన నాటి నుంచి ఆ భూములపై ఎలాంటి లావాదేవీలకు అవకాశం లేదని, అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని, బ్యాంకుల్లో అప్పులు తీసుకోరాదని ఆ నోటిఫికేషన్లలో స్పష్టం చేసింది. 60 రోజుల్లోగా సంబంధిత రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, రెండు రోజుల వ్యవధిలో మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి పరిధిలో మొత్తం 826.25 ఎకరాలు సేకరించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు.

25వేల మందికి ఉపాధి కల్పించేలా

దుద్యాల మండలంలో ఇంతకు ఫార్మా విలేజ్‌లు ప్రతిపాదించిన లగచర్ల, పోలేపల్లి, హకీంపేట రెవెన్యూ గ్రామాల పరిధిలోనే మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారు. టెక్స్‌టైల్, ఇతర పరిశ్రమలు ఏర్పాటు చేసి 25 వేల మంది వరకు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం భావిస్తున్నారు. మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యతను ప్రభుత్వం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ(టీజీఐఐసీ)కు అప్పగించింది. నిర్వాసితులకు పరిహారంతో పాటు పునరుపాధి, పునరావాసం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ప్రభుత్వం చేపట్టే భూసేకరణలో భూములు కోల్పోయే రైతులకు చట్ట ప్రకారం నష్ట పరిహారంతో పాటు 125 గజాల నివాస స్థలం, కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే దుద్యాల మండలంలో భూములు కోల్పోనున్న రైతులకు ప్రభుత్వం పరిహారం, పునరావాసం విషయమై స్పష్టత రావాల్సి ఉంది.